

డిజిటల్ అరెస్టు పేరుతో..

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగినికి కాల్ చేసి రూ.84 లక్షలు కాజేశారు. 10లో▸



నమ్మక ద్రోహికి కటకటాలు

పొలంలో పని చేస్తున్న మహిళపై దాడి చేసి బంగారు నగలు దోచుకెళ్లిన నిందితుడిని పోలీసులు కటకటాల పాలు చేశారు. 10లో▸



ఆధునిక పద్ధతులతో..

రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు రాములునాయక్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

షాద్‌నగర్ కవులకు సత్కారం



ప్రశంసాపత్రాలు అందుకున్న కవులు

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో తెలుగు భాషా చైతన్య సమితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాష సదస్సు, కవి సమ్మేళనం నిర్వహించారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన కవులు నరేందర్‌రావు, రవిప్రకాష్ హర్మాక్ తమ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు బడే సాబ్, ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాసిం,విశ్రాంత ప్రొఫెసర్ జయరాములు వారిని సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

చొరబాటుదారులను వెనక్కి పంపండి

డీజీపీకి ఫిర్యాదు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ ముస్లింలు, రోహింగ్యాలను గుర్తించి వారి దేశాలకు తరలించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ గురువారం డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం రాఘవేందర్ మాట్లాడుతూ.. అక్రమ చొరబాటుదారులతో శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశాలు ఉన్నందున, వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో నివసిస్తున్న వారితో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని డీజీపీకి వివరించినట్లు చెప్పారు. దీనికి డీజీపీ సానుకూలంగా స్పందించారని, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నాయకురాలు హైందవిరెడ్డి ఉన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టం తీసుకొచ్చిందని, ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు సర్వేయర్లు అవసరమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ పరిపాలనకు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగం సహా యంగా రాష్ట్రంలో 5,000 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇందు కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తోందన్నారు.అన్ని మీ సేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు ప్రాస్పెక్టస్ పొందొచ్చని, మీ సేవా కేంద్రాల్లోనే ఈ నెల 17వ తేదీ వరకు సమర్పించాలని సూచించారు. ఇంటర్‌లో గణితంలో 60 శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్, డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) సమానమైన అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాల్లో 26వ తేదీ నుంచి 50 పని దినాల్లో శిక్షణ ఇస్తారన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

మహేశ్వరం: ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని, సత్వరం పరిష్కరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు స్థానిక డిపో మేనేజర్ లక్ష్మీసుధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ప్రయాణికులు 91542 98784 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. సలహాలు, సూచనలు అందించడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి



ఇర్విన్‌లో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

మాడ్గుల: నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండలంలోని ఇర్విన్ గ్రామంలో ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ అధికారి కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. మండలస్థాయి అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, విస్తరణ అధికారులు జోష్న, భార్గవి, రాజేష్ పాల్గొన్నారు.

ఇసుక బేజార్!

ఇసుక బజార్‌కు ఆదరణ కరువు

- ఆదిబట్లలో గత నెల 16న ప్రారంభం
- ప్రచార లోపంతో నామమాత్రంగా కొనుగోళ్లు
- నిల్వ ఉన్నది 89,000 మెట్రిక్ టన్నులు
- ఇప్పటికి అమ్మింది 154 టన్నులే..



ఆదిబట్లలోని ఇసుకబజార్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇసుక అక్రమ రవాణకు కళ్లెం వేయడంతోపాటు నాణ్యమైన ఇసుకను అందుబాటులోకి తీచ్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇసుక బజార్‌లకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీటిని ప్రారంభించింది. ఇందులో భాగంగా మన జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిబట్ల ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో గతనెల 16న స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఈ ఇసుక బజార్‌కు ఆదరణ కరువైంది.

ఆన్‌లైన్ విధానంలో విక్రయాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌ల్లో సన్న ఇసుక టన్నుకు రూ.1,800, దొడ్డు ఇసుక రూ.1,600 చొప్పున ధర నిర్ణయించారు. ప్రతి కొనుగోలు ఆన్‌లైన్ విధానంలో కొనసాగించాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఇసుక అమ్మకాలు చేపట్టాలని విజిలెన్స్ కమిటీలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డంపులు లేకుండా అరికట్టారు. కేసులు నమోదు చేసి అక్రమ డంపులను కట్టడి చేశారు. అనంతరం ఇసుక బజార్‌లను తెరిచారు. ప్రస్తుతం ఆదిబట్లలోని ఇసుక బజార్‌లో రెండు వేబ్రిడ్జిలను ఏర్పాటు చేసి, కాంట్రాక్టర్ల ద్వారా రవాణా, ఇసుక నింపే యంత్రాలను ఏర్పాటు చేశారు. వినియోగదారులకు 89,000 మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచారు. వంగమర్తి, వీరాపురం, విజయనగరం, అనంతారం నుంచి రీచ్‌ల ద్వారా ఇసుక తీసుకొచ్చి డంప్ చేశారు.

ఎక్కడి నిల్వలు అక్కడే..

ఇసుక బజార్‌ను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు (22 రోజులు) అమ్మింది 154 టన్నులు మాత్రమే. ఆదిబట్ల మున్సిపాలిటీలో ఇసుకబజార్‌ను ప్రారంభించిన అధికారులు ఆ మేరకు ప్రచారం చేయకపోవడంతో చాలామందికి ఇక్కడ ఇసుక నిల్వలు ఉన్నాయనే విషయమే తెలియకుండా పోయింది. ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున బృహత్తర కార్యక్రమం చేపట్టినప్పటికీ సరైన ప్రచారం లేకపోవడంతో ఎక్కడి నిల్వలు అక్కడే నిలిచిపోయాయి. రోజుకు కనీసం ఒక్క లారీ కూడా అమ్ముడు పోవడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రచారం లేకపోవడంతో కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని చెబుతున్నారు.

సరైన ప్రచారమే లేదు



ఆదిబట్లలో ఇసుక బజార్ ఉందన్న విషయం ఎవరికీ తెలియదు. అధికారులు వచ్చి ప్రారంభించి వెళ్లిపోయారు. స్థానికంగా పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నా ఇసుక బజార్‌లో ఎవరూ కొనుగోలు చేయడం లేదు. ఇదే ధరకు బయట దొరకడంతోపాటు సరైన ప్రచారం లేదు. ప్రభుత్వం ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో విక్రయాలు జరిపితే బాగుంటుంది.

– బండ రాజు, ఆదిబట్ల

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి



ఇసుక కొనుగోళ్ల కోసం ఆన్‌లైన్‌లో ముందుగా కస్టమర్ ఐడీని రూపొందించుకోవాలి. ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇలా పోర్టల్ రూపొందించింది. అవసరమైతే మీ సేవ కేంద్రాలకు వెళ్తే దరఖాస్తు చేస్తారు. లేదంటే టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. ఇసుక బజార్ ద్వారా నాణ్యమైన ఇసుక అందిస్తున్నాం.

– నవీన్, ఇసుకబజార్ అధికారి

సమస్యలను వదిలేసి.. అందాల పోటీలా?



బాధితులకు సామగ్రి అందజేస్తున్న నారాయణ

- ప్రభుత్వంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపాటు
- గుడిసెలు కాలిపోయిన బాధితులకు సామగ్రి అందజేత

హయత్‌నగర్: పేదల సమస్యలను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల నిర్వహణలో నిమగ్నమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని కుంట్లూరు రావినారాయణరెడ్డి కాలనీలో గత నెల 26న జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసెలు కాలిపోయిన బాధితులను గురువారం పరామర్శించారు. వారికి దుప్పట్లు, టవల్స్, ప్లాస్టిక్ బకెట్లు తదితర సామగ్రి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కోటీశ్వరులైన అందగత్తెలు సగం దుస్తులు ధరిస్తే.. గతి లేని పేదలు నిండుగా దుస్తులు ధరిస్తారని తెలిపారు. ఓటు వేసి గెలిపించే ప్రజలను పట్టించుకోకుండా, అందాలు ఆరబోసి వెళ్లిపోయే వారికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. పేదల భూములను కన్నేసి వారిని ఇక్కడి నుంచి తరిమేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే అభాగ్యుల గూళ్లను నిప్పు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల పక్షాన తమ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. బాధితులకు కేవలం రూ.6 వేలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు సామగ్రి అందించేందుకు ముందుకు వచ్చిన విజయవాడ పాపులర్ షూమార్ట్‌ను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, నాయకులు తాలు, పల్లె నర్సింహ, పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్‌నాయక్, నర్సింహ, వట్టి వనిత, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించండి

చేవెళ్ల: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, గౌరవ అధ్యక్షుడు సందీప్ గురువారం మహేందర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ఈనెల 10న నిర్వహించే రాష్ట్ర స్థాయి పంచాయతీ కార్యదర్శుల సదస్సుకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేని గ్రామాల్లో కార్యదర్శులే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఆయా గ్రామాల్లో ఫీల్డ్‌అసిస్టెంట్‌లను నియమించాలని కోరారు. క్రీడా కోటాలో ఎంపికైన 98మంది జీపీఎస్‌లను తొలగించిన నేపథ్యంలో వారిని తిరిగి సర్వీస్‌లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి సానుకులంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రవిశెట్టి, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలో భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం: కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంట్రప్రెన్యూర్స్ (ఎంఎస్‌ఎంఈ) కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో కేంద్ర ప్రభుత్వం రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ పెర్ఫార్మెన్స్ పథకంలో భాగంగా తెలంగాణలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి సంస్థల అభ్యున్నతి కోసం ప్రతి జిల్లా పరిశ్రమల కేంద్రంలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయబోతోందన్నారు. దీనికి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలకు జిల్లాలోని స్థానికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. www.msme.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా పరిశ్రమల కేంద్రం శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఓయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని తల్లారం గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయత దుబ్బాకుల కృష్ణస్వామి రచించిన ×స్మృతి పథంలో పద్మ॰ పుస్తకాన్ని గురువారం ఆయన ప్రముఖ సాహితీవేత్త భాస్కరయోగి, ప్రముఖ కవి, చిత్రకారుడు గుండోజు యాదగిరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ గల కవులు, రచయితలు ఉన్నప్పటికీ వారికి సరైన గుర్తింపు లేకపోవడంతో వారి ప్రతిభ బయటకు రాలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని ప్రోత్సహించి, వారి రచనలను పది మందికి చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లలకు పుస్తకాలు చదివించే అలవాటు చేయించాలని, అప్పుడే వారు చరిత్రల గురించి తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, పండరీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కుర్చీలాట!



ఏప్రిల్ నెలాఖరున పదవీ విరమణ చేసిన సీఈఐజీ

- సీటు దక్కించుకునేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు
- కాసుల వర్షం కురిపిస్తుండడంతో భారీగా డిమాండ్
- ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ ప్రమాదాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించాల్సిన తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి (సీఈఐజీ) కార్యాలయంలో కుర్చీలాట మొదలైంది. ఇప్పటికే అడ్డదారిలో వచ్చి అడ్డగోలు వసూళ్లకు పాల్పడిన సీఈఐజీ ఏప్రిల్ నెలాఖరున పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ కుర్చీని చేజిక్కించుకునేందుకు ఎవరికి వారు పోటీపడుతున్నారు. ఆశావహులు ప్రభుత్వ పెద్దలు, సచివాలయ కేంద్రంగా పని చేస్తున్న ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే ఓ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అడ్డదారిలో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్‌గా పదోన్నతి పొందినట్లు తెలిసింది. ఈ విషయం మరో డిప్యూటీ డీఈకి తెలిసి కోర్టు ద్వారా ఈ చర్యను అడ్డుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకు సదరు డిప్యూటీ ఈఐ రూ.కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

అసలేం జరుగుతోంది?

భారీ బహుళ అంతస్తుల భవనాలు, సినిమా హాళ్లు, హోటళ్లు, పరిశ్రమల్లో విద్యుత్ ప్రమాదాల నియంత్రణ కోసం ప్రభుత్వం తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ విభాగాన్ని 1987లో ఏర్పాటు చేసింది. 15 మీటర్ల ఎత్తున్న భవనాలు సహా 70 కిలోవాట్స్ సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ ఉన్న ప్రతి కనెక్షన్స్ వీరి అనుమతి తప్పనిసరి చేసింది. ఈ నిబంధనే వారికి కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి (సీఈఐజీ)తో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి-1,2,3 డివిజన్లు, మెదక్-1,2 డివిజన్లు, మహబూబ్‌నగర్, నిజామాబాద్ డివిజన్లకు ఒక్కో డిప్యూటీ డీఈ ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. వీరితో పాటు హైదరాబాద్, నిజామాబాద్‌కు ఇద్దరు ఈఐలు ఉన్నారు. లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, పది మంది డీఈలు, ముగ్గురు ఏఈలున్నారు. 2018 నుంచి ప్రభుత్వం ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. సీఈఐజీ సహా ఇతర కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ సీఈఐజీ స్థాయి అధికారే ఇప్పటి వరకు వీటికి ఇన్‌చార్జి సీఈఐజీగా వ్యవహరిస్తూ వచ్చారు. ఆయన కూడా ఉద్యోగ విరమణ చేయడంతో ఆయా కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. బిల్డర్లు, పరిశ్రమల యజమానులు థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లతో విద్యుత్ పనులు చేయిస్తుంటారు. వీరు నాలుగు రాళ్లు వెనుకేసుకోవాలనే ఉద్దేశంతో ఐఎస్ఐ సర్టిఫైడ్ విద్యుత్ పరికరాలకు బదులు మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాసిరకం కేబుళ్లు, ఎంసీబీలు, బ్రేకర్లు, ఆర్సీసీబీలు, ఎర్తింగ్స్ రాడ్స్ వాడుతున్నారు. భవిష్యత్తు అవసరాల మేరకు లైన్లు, కేబుళ్లు, ఎంసీబీలు వాడకపోవడంతో కొద్ది రోజులకే షార్ట్‌సర్క్యూట్ తలెత్తి అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో రూ.కోట్ల ఆస్తి నష్టంతో పాటు విలువైన ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోంది.

ఆ లింకును తొలగించండి

2020 నవంబర్ నుంచి 2025 ఏప్రిల్ 25 నాటికి టీఎస్ఐపాస్ ద్వారా 13,453 దరఖాస్తులు రాగా, వీటిలో 12,609 దరఖాస్తులను ఆమోదించారు. ఇదే సమయంలో జనరేటర్ల ఏర్పాటు కోసం 1,072 దరఖాస్తులు రాగా, వీటిలో 994 ఆమోదించారు. 93 సినిమా థియేటర్ల దరఖాస్తుల్లో 83 ఆమోదించారు. దరఖాస్తు సహా సీఈఐజీ తనిఖీ, అనుమతి ధ్రువీకరణ పత్రం జారీ కోసం రూ.10 వేలలోపే ఫీజు నిర్ణయించింది. దరఖాస్తు చేసిన 14 రోజుల్లోనే ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాలి. కానీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు మొదలు, సీఈఐజీ వరకు ఎవరి స్థాయిలో వారు ఫైళ్లను రోజుల తరబడి తొక్కిపెడుతున్నారు. బిల్డింగ్ విద్యుత్ లైన్స్ డ్రాయింగ్స్ మొదలు టీఎస్‌బీపాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, క్షేత్రస్థాయిలో తనిఖీలు, ఆమోదం వరకు ఇలా భవన నిర్మాణ సామర్థ్యం/పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి.. ఒక్కో ఫైలుకు ఒక్కో ధర నిర్ణయించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ సంస్థలు, పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, సోలార్ ప్లాంట్ల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. తర్వాత పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్ పేరుతోనూ వసూలు చేస్తున్నారు. ఇచ్చేందుకు నిరాకరించిన వారి ఫైళ్లకు రకరకాల కొర్రీలు పెట్టి తిప్పిపంపు తున్నారు. సీఈఐజీ ఇన్‌స్పెక్టర్ల అక్రమ వసూళ్లతో విద్యుత్ సంస్థల్లో పని చేసే ఇంజినీర్లు చెడ్డపేరు మూటకట్టుకోవాల్సి వస్తోంది. ఏపీ సహా ఇతర రాష్ట్రాల్లో మాదిరి హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లకు సీఈఐజీ లింకును తొలగించాల్సిందిగా కోరుతూ ఇటీవల డిస్కం ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాయడం, ఇదే అంశంపై ఇటీవల సంబంధిత ఇన్‌స్పెక్టర్లతో సచివాలయ కేంద్రంగా సమావేశం నిర్వహించడం కొసమెరుపు.



మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో కొనసాగుతున్న సర్వే పనులు

ఫార్మా భూముల్లో సర్వే

కందుకూరు: ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను సర్వే చేయిస్తున్న అధికారులు వీటికి ఫెన్సింగ్ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్ 112లోని భూమిని సర్వే చేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫ్యూచర్ సిటీ సీపీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు రోజులుగా కొనసాగుతున్న సర్వేలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ముప్పు



రోడు పక్కకు దూసుకెళ్లిన బస్సు నుంచి దిగుతున్న ప్రయాణికులు

- కమాన్‌పట్టీలు విరగడంతో ప్రమాదం
- రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు
- 60 మంది ప్రయాణికులు సురక్షితం

చేవెళ్ల: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు కమాన్ పట్టీలు విరిగిపోవడంతో అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బ్రేక్ వేసి, నియంత్రించడంతో పెను ప్రమాదమే తప్పింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్జాగూడ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి కొండగల్, కోస్గి వెళ్తున్న కోస్గి ఆర్టీసీ బస్సు మీర్జాగూడ బస్ స్టేజీకి సమీపంలోకి రాగానే రోడ్డు మలుపు వద్ద కమాన్ పట్టీలు విరిగిపోయాయి. దీంతో బస్సు రోడ్డు కిందికి దూసుకెళ్లి, ఆగిపోయింది. ఈ సంఘటనతో అందులో ఉన్న సుమారు 60మంది ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సు మరికొంత దూరం వెళ్లి ఉంటే బోల్తా పడి ఉండేదని చెప్పారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మక ద్రోహికి కటకటాలు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ గంగాధర్



రికవరీ చేసిన సొమ్ము

మహిళపై దాడి కేసును ఛేదించిన పోలీసులు

కడ్తాల్: పొలంలో పని చేస్తున్న మహిళపై దాడి చేసి బంగారు నగలు దోచుకెళ్లిన నిందితుడిని పోలీసులు కటకటాల పాలు చేశారు. మండలంలోని చరికొండలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. వివరాలను సీఐ గంగాధర్ గురువారం వెల్లడించారు. గ్రామానికి చెందిన గుల్లకుంట మహేశ్‌గౌడ్ వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆయన బుధవారం బంధువుల పెళ్లికి హైదరాబాద్‌కు వెళ్లాడు. తన పశువుల బాధ్యతను పక్క పొలానికి చెందిన నాగిళ్ల మహేశ్‌కు అప్పజెప్పాడు. అలాగే తన తల్లి జంగమ్మకు ఆసరాగా ఉండమని సూచించాడు. అదే రోజు సాయంత్రం ఫోన్ చేసి ఊరికి రావడానికి ఆలస్యమవుతుందని మహేశ్‌గౌడ్ తెలిపాడు. దీంతో ఇదే అదునుగా భావించిన మహేశ్ పొలంలో పని చేస్తున్న జంగమ్మ మెడలోని బంగారు పుస్తెల తాడు, చైన్(6 తులాలు) లాక్కొని దాడి చేశాడు. ఆమె అపస్మారకస్థితిలో వెళ్లడంతో చనిపోయిందని భావించి వెళ్లిపోయాడు. దొంగిలించిన సొమ్మును అదే పొలంలో దాచిపెట్టాడు. రాత్రి 10 గంటలైనా తన తల్లి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన మహేశ్‌గౌడ్ వెంటనే మహేశ్‌కు ఫోన్ చేయగా.. సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో గ్రామస్తులతో కలిసి పొలానికి వెళ్లి వెతకగా గాయాలతో జంగమ్మ కన్పించింది. మహేశ్ దాడి చేసి బంగారు నగలు ఎత్తుకెళ్లాడని ఆమె తెలిపింది. దీంతో కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోన్ లోకేషన్ ఆధారంగా నాగిళ్ల మహేశ్‌ను అరెస్ట్ చేశారు. దొంగిలించి బంగారంతో పాటు, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వాహనాల తనిఖీ



కోహెడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ రాజు, సీఐ జగదీశ్

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోహెడ క్రాస్ రోడ్డు వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కోహెడ, రాందాసుపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో ఎవరైనా సాయంత్రం వెళల్లో ద్విచక్ర వాహనాన్ని నిలిపితే గుర్తు తెలియని దుండగులు వారిని బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న సంఘటనలు తెలిసిందే. ఈ నేపథ్యంలో పకడ్బందీగా శాంతి భద్రతల నిర్వహణకు ఏసీపీ కేపీవీ రాజు నేతృత్వంలో సీఐ జగదీశ్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఏసీపీ రాజు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

మియాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఆర్సీపురం అశోక్ నగర్‌కు చెందిన విశ్వరూపచారీ కుమార్తె బి.గోపి ప్రియ(29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. గురువారం ఉదయం ఆమె మదీనాగూడలోని కల్ట్ ఫిట్‌నెస్ సెంటర్‌లో యోగా చేసేందుకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా మదీనాగూడ అర్చన ఆసుపత్రి సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఆమెను ఢీకొనడంతో కింద పడింది. అదే సమయంలో మియాపూర్ నుంచి చందానగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు ఆమెను సమీపంలోని అర్చన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి విశ్వరూప చారీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎడిటర్ ఇంట్లో సోదాలు అమానుషం

టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ



సత్యనారాయణగౌడ్, జిల్లా అధ్యక్షుడు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంట్లో ఏపీ పోలీసుల సోదాలు చేయడాన్ని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీయూడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, ఎం.సైదులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఓ బాధ్యత గల పత్రికా ఎడిటర్ ఇంట్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేయడం సరికాదన్నారు. నిబంధనలు, ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలిస్తూ జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా పోలీసులు వ్యవహరించడం అమానుషమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా జర్నలిస్టులను భయపెట్టాలనే ఉద్దేశంతో ఏపీ పోలీసులు చట్టానికి విరుద్ధంగా వ్యవహారించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. తప్పు చేస్తే నిబంధనల ప్రకారం నడుచుకోవాలే కానీ ఏకపక్షంగా ఇళ్లలోకి చొరబడటం ఏమిటని ప్రశ్నించారు. ఎడిటర్ ధనంజయరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

పూడికతీత పనులు చేపట్టాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో వర్ష పునీటి పైప్‌లైన్‌లకు పూడికతీత పనులు చేపట్టాలని నియోజకవర్గం గుడ్ గవర్నెన్స్ కమిటీ వారు బల్దియా జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు గురువారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి, బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసూదన్ మాట్లాడుతూ..వరద నీటి పైప్‌లైన్‌లు పూడికలతో నిండిపోయాయన్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులపై సైతం డ్రైనేజీ నీరు ప్రవహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మనీష్, గోదా లక్ష్మీకాంత్ యాదవ్ తదితరులున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.84 లక్షలు స్వాహా



బాధితురాలిగా మారిన ప్రభుత్వ ఉద్యోగిని

- నరేష్ గోయల్ కేసుతో సంబంధం ఉందని ఫోన్
- తాత్కాలిక బెయిల్, రిఫండ్ అంటూ టోకరా

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరు చెబుతూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగినికి కాల్ చేసిన కేటుగాళ్లు రూ.84 లక్షలు కాజేశారు. ఆద్యంతం ఆమెను భయంలో ఉంచిన ఈ–కేడీలు తాత్కాలిక బెయిల్ కూడా ఇచ్చారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ స్కామ్ పూర్వాపరాలిలా ఉన్నాయి... ఓ ప్రభుత్వ ఉద్యోగినికి (57) ఈ ఏడాది మార్చి 4న ఓ ఫోన్ కాల్ వచ్చింది. ట్రాయ్ ఉద్యోగిగా పరిచయం చేసుకున్న అవతలి వ్యక్తి... ఆమెను పూర్తిగా నమ్మించేందుకు తన ఐడీ నెంబర్ అంటూ టీడీ62813 అనే సంఖ్యను చెప్పాడు. బాధితురాలి పేరుతో నమోదై ఉన్న సెల్ నెంబర్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించారని, ఇందుకు సంబంధించి తమ వద్ద ఫిర్యాదు ఉందంటూ కంప్లైంట్ నెంబర్ కూడా చెప్పాడు. వీలున్నంత త్వరగా వ్యక్తిగతంగా వెళ్లి ట్రాయ్ కార్యాలయంలో అధికారులకు కలవాలని చెప్పాడు. ఆ కొద్దిసేపటికి ముంబై సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధిని అంటూ మరో వ్యక్తి ఫోన్ చేశాడు. వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసిన అతను తతను దర్యాప్తు అధికారిగా పరిచయం చేసుకున్నాడు. మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ముంబైకి చెందిన వ్యాపారి నరేష్ గోయల్ వ్యవహారాల్లో బాధితురాలి పేరుతో ఉన్న ఫోన్ నెంబర్ వాడారని చెప్పాడు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమైనందున న్యాయపరమైన అంశాలు అనేకం ఉంటాయని, అప్పటి వరకు విషయం కుటుంబీకులతో సహా ఎవరికీ చెప్పొద్దని స్పష్టం చేశాడు. గత నెల 8న వాట్సాప్ ద్వారానే బాధితురాలికి మరో వీడియో కాల్ వచ్చింది. కేసుకు సంబంధించిన చీఫ్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌గా చెప్పుకున్న ఆ వ్యక్తి కీలక కేసులో ఆరోపణలు ఉండటంతో మీ ఆర్థిక లావాదేవీలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశీలించి, క్లీన్ చిట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. నరేష్ గోయల్‌తో సంబంధాలు ఉన్న స్లీపర్ సెల్స్ కొందరు బెదిరింపులకు దిగే అవకాశం ఉందని, ఈ కారణంగానే మీ ఫోన్‌పై పూర్తి నిఘా ఉంచుతామని చెప్పాడు. గత నెల 11న వీడియో కాల్ చేసిన మరో నేరగాడు తాను సర్వైలెన్స్ ఆఫీసర్‌నిని పరిచయం చేసుకున్నాడు. డిఫెన్స్ లాయర్ అంటూ మరో నేరగాడినీ పరిచయం చేసిన అతను డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు బాధితురాలికి చెప్పాడు. డిఫెన్స్ లాయర్‌గా చెప్పుకున్న వ్యక్తి వర్చువల్‌గా సుప్రీం కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తారని చెప్పాడు. ఇదంతా నిజమని నమ్మిన బాధితురాలు తన భర్త ఆరోగ్యం బాలేదని, వర్చువల్ అప్పీరెన్స్‌కు కొంత సమయం కావాలని కోరారు. దీంతో ఆమెకు వాట్సాప్ ద్వారా టెంపరరీ బెయిల్ అని రాసి, సుప్రీం కోర్టు పేరుతో ఉన్న పత్రాలు, రూ.30 లక్షల విలువైనదిగా తయారు చేసిన నకిలీ ష్యూరిటీ బాండ్ పంపించాడు. దీని నిమిత్తం ఆ మొత్తం తన ఖాతాల్లో వేయించుకున్నాడు. తాము కోరిన మొత్తం సూచించిన బ్యాంకు ఖాతాల్లో వేయాలని, ఆ లావాదేవీలను ఆర్‌బీఐ, న్యాయస్థానం పరిశీలించి క్లీన్ చిట్ ఇస్తాయని నమ్మించాడు. ఆపై కేసు వీగిపోవడంతో పాటు డిపాజిట్ చేసిన నగదు అంతా రిఫండ్ వస్తుందని నమ్మించాడు. దీంతో బాధితురాలు తన ఎఫ్‌డీలు విత్‌డ్రా చేసి, బంగారంపై రుణం తీసుకుని, అప్పులు చేసి మొత్తం రూ.84 లక్షలు నేరగాళ్లు సూచించిన ఖాతాల్లో వేశారు. మంగళవారం ఆఖరుసారిగా కాల్ చేసిన నేరగాళ్లు కేసు క్లోజ్ అయిందని, డిపాజిట్ చేసిన మొత్తం త్వరలోనే రిఫండ్ అవుతుందని చెప్పారు. ఆ మరుసటి రోజు నుంచి వారి ఫోన్లన్నీ స్విచ్ఛాఫ్ అయిపోయాయి. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

చెల్లని చెక్కు ఇచ్చి చెక్కేసింది..

నగల షాపులను బురిడీ కొట్టిస్తున్న 'కిలేడీ'

గచ్చిబౌలి: సినీ ప్రముఖులు, రాజకీయ పెద్దలు తెలుసని బిల్డప్ ఇస్తూ విలువైన నగలను ఆర్డర్ చేసి ఉడాయించిన ఓ కిలేడీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. మాయమాటలు చెప్పి రూ.50 లక్షల విలువ చేసే నగలను తీసుకుని బిల్లులు చెల్లించకుండా తిరుగుతున్న మహిళ కోసం రాయదుర్గం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కొద్ది రోజుల క్రితం అబిడ్స్‌లోని ఓ నగలు షాపు యజమానికి రమాదేవి అనే మహిళ వాట్సాప్ వీడియో కాల్ చేసి వివిధ డిజైన్ల నగలను ఎంపిక చేసుకుంది. దాదాపు రూ.50 లక్షల విలువైన నలను రాయదుర్గం పీఎస్ పరిధిలోని తాను నివాసం ఉండే ఓ గేటెడ్ కమ్యూనిటీకి తెప్పించుకుంది. చెక్ ఇచ్చి కొంత డబ్బు తక్కువగా ఉందని రెండు రోజుల తర్వాత బ్యాంకులో వేసుకోవాలని సూచించింది. అయితే ఆమె ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో డబ్బులు ఇవ్వకుండా మొఖం చాటేసింది. బాధితులు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలు రమాదేవి కోసం గాలిస్తున్నారు. ఇది ఇలా ఉండా గతంలో ఇదే తరహాలో నగలు కాజేసిన ఆమెపై నార్సింగి పీఎస్ పరిధిలో ఒకటి, రాయదుర్గం పీఎస్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. అయినా తన తీరుమార్చుకోని సదరు మహిళ సినీ ప్రముఖులు, రాజకీయనాయకులతో దిగిన ఫొటోలు చూపిస్తూ, తాను ధనవంతురాలినని బిల్డప్ ఇస్తూ జ్యూవెల్లర్ షాపుల యజమానులతో పరిచయం చేసుకుంటుంది. కొన్ని సందర్భాల్లో నమ్మకంగా ఉన్నట్లు నమ్మిస్తుంది. ఆ తర్వాత పెద్ద మొత్తంలో విలువైన నగలు తీసుకుని మోసాలకు పాల్పడుతోంది. గతంలో నమోదైన కేసుల్లో నోటీసులు ఇచ్చిన పోలీసులు ఈ సారి ఆమెను అరెస్ట్ చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

11న బొటానికల్ గార్డెన్ బర్డ్ వాక్

గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 11న బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్ నిర్వహిస్తున్నట్లు టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బర్డ్ వాక్ కొనసాగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పక్షుల జాతులను గుర్తించడం, ఏ పక్షులు ఏ వాతావరణంలో, ఏ రకమైన వృక్షాలపై గూళ్లు కడతాయి, ఎలాంటి ఆహారం తీసుకుంటాయి, ఎలా కదులుతాయి, వాటి ప్రవర్తన ఉంటుందో పక్షి నిపుణులు వివరిస్తారని పేర్కొన్నారు. బర్డ్ వాక్ రావాలనుకునే వారు 9885298980, 7382307476 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

తుక్కుగూడ: కుల గణన, ఓబీసీల భవిష్యత్ నిర్మాణం, సామాజిక న్యాయం అనే అంశాలపై ఈనెల 10న నగరంలోని సోమాజిగూడ క్షత్రియ హోటల్‌లో ఉదయం 10:30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సహాయ మంత్రి నరేంద్ర కశ్యప్‌తో పాటు పలువురు వక్తలు హాజరవుతారని పేర్కొన్నారు.

దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

అంబర్‌పేట: దృష్టి చోరీలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల ముఠాను అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. డీఐ హఫీజుద్దీన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొఘల్‌పురా సుల్తాన్‌షాహికి చెందిన సయ్యద్ ఆఫ్రీదిన్, షేక్ హమీదుద్దీన్, నసీమ్ బేగం, ఖయ్యూం సుల్తానా ముఠాగా ఏర్పడి దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 5న వారు అంబర్‌పేట తిరుమల నగర్‌లోని భవానీలాల్ జ్యువెల్లరీ దుకాణానికి వచ్చారు. వృద్ధురాలైన ఖయ్యూం సుల్తానా తన ఒంటిపై ఉన్న బంగారు గాజులను తీసి ఇచ్చి వాటిపై డబ్బులు కావాలని కోరింది. వాటికి రూ.2 లక్షలు వస్తాయని చెప్పిన దుకాణ యజమాని డబ్బులు ఇచ్చేందుకు సిద్ధపడి కౌంటర్‌లో నుంచి తీసి బయటపెట్టారు. బంగారాన్ని పరీక్షించేందుకు అతను లోపలి వెళ్లగానే వారు కౌంటర్ పై ఉన్న రూ.2 లక్షల నగదును తీసుకుని ఉడాయించారు. అదే సమయంలో బంగారాన్ని పరీక్షించిన యజమానికి అది నకిలీదిగా గుర్తించి బయటికి చూడగా సుల్తానాతో పాటు మిగతా వ్యక్తులు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

సేంద్రియ సాగుతో సత్ఫలితాలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు రాములు నాయక్
- ఎర్వగూడలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



శంకర్‌పల్లి: మాట్లాడుతున్న వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు రాములు నాయక్



షాబాద్: లక్ష్మరావుగూడలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత డాక్టర్ సతీష్

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసి, అధిక దిగుబడులు సాధించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు రాములునాయక్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండలం ఎర్వగూడ గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్నదాతలు అధిక లాభాలు పొందాలనే ఉద్దేశంతోనే వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో గ్రామగ్రామాన అవగాహన సమావేశాలను నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్యంగా రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. శాస్త్రవేత్త శర్మ మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడిని అలవాటు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించి, ఎరువులు వాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మి, చేవెళ్ల ఏడీఏ సురేశ్ బాబు, శంకర్‌పల్లి ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి సురేశ్ బాబు, ఏఈఓ మనీషా, ఏఎంసీ మల్లేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యూరియాను తగ్గించాలి..

షాబాద్: పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలని వ్యవసాయశాఖ సీనియర్ శాస్త్రవేతలు డాక్టర్ పి.సతీష్, శాస్త్రవేత్త డాక్టర్ డి.శిరీష, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. పోలేపేట్, లక్ష్మారావుగూడ గ్రామాల్లో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేతలు అవగావాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చని తెలిపారు. పంట మార్పిడిని పాటించాలని సూచించారు. పచ్చిరొట్ట సాగు ద్వారా ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాశాఖ అధికారి వెంకటేశం, ఏఈఓలు గీత, రాజేశ్వరి, కిరణ్మయి, వ్యవసాయ విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, శ్రీను, అవనిజ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ స్నాచింగ్ కోసం బైక్ చోరీ...

ఇద్దరు పాత నేరస్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న జూబ్లీహిల్స్ డీఐ మధుసూదన్ నిందితులు నసీర్ ఖాన్, ఇర్ఫాన్ ఖాన్

బంజారాహిల్స్: మొబైల్ స్నాచింగ్‌ల కోసం బైక్ చోరీకి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..ఆగాపురాకు చెందిన నసీర్‌ఖాన్ అలియాస్ నజీర్ ఆటోడ్రైవర్‌గా పని చేసేవాడు. అఫ్జల్‌సాగర్‌కు చెందిన ఇర్ఫాన్‌ఖాన్ అలియాస్ అర్మాస్ ఫర్నీచర్ షాపులో వర్కర్‌గా పని చేస్తున్నాడు. స్నేహితులైన వీరు జల్సాలకు అలవాటు పడ్డారు. వీరిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొబైల్ స్నాచింగ్‌లతో పాటు బైక్ చోరీలు, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. ఏప్రిల్ 18న హయత్‌నగర్‌లో ఓ బైక్ చోరీ చేసిన బైక్ చోరీ చేసిన రషీద్ ఖాన్ అదే బైక్‌పై ఇర్ఫాన్‌ఖాన్‌తో కలిసి ఏప్రిల్ 30న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 5 మొబైల్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఫిర్యాదు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో స్నాచింగ్ జరిగిన ప్రాంతం నుంచి నాలుగు రోజుల పాటు 100 సీసీ కెమెరాలను పరిశీలించారు. గురువారం ఉదయం వీరు ఇద్దరూ హబీబ్‌నగర్‌లోని ఓ ఇంటి ఎదుట ఆగడాన్ని గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో రషీద్‌ఖాన్‌పై ఫిలింనగర్, బంజారాహిల్స్, హయత్‌నగర్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, నాంపల్లి, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి, హుమాయున్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 17 కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఇర్ఫాన్‌ఖాన్‌పై హబీబ్‌నగర్, హుమాయున్‌నగర్, మార్కెట్, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 6 కేసులు ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరూ కలిసి మొబైల్ స్నాచింగ్‌ల కోసమే బైక్ చోరీ చేసినట్లుగా గుర్తించారు. వీరి నుంచి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుణం పేరుతో రూ. 2.4 లక్షలు టోకరా

ఫిలింనగర్: రుణం ఇప్పిస్తామని రూ. 2.4 లక్షలు కాజేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఫిలింనగర్ లేబర్ అడ్డాకు చెందిన చెటెల్లి వెంకన్నకు గత నెల 8న ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను బ్యాంక్ ఉద్యోగినని, రూ.2,40,000 రుణానికి మీరు అర్హులని, ప్రాసెస్ చేయడానికి రూ.56,800 చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన వెంకన్న వారు చెప్పినట్లుగా మూడు వేర్వేరు ఖాతాలకు రూ.10,000 ఒకసారి, రూ.26,900 మరోసారి, రూ.20,000లు ఇంకోసారి బదిలీ చేశాడు. నగదు చెల్లించిన అనంతరం రుణం మంజూరు విషయం తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు. అయితే తమ బ్యాంక్‌లో అలాంటి వ్యక్తి లేడని, రుణానికి సంబంధించిన స్కీమ్‌లు లేవని చెప్పడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు కోసి.. మృతదేహాన్ని తగులబెట్టి..

- మహిళ దారుణ హత్య
- చాంద్రాయణగుట్టలో ఘాతుకం



కేతావత్ బుజ్జి (ఫైల్)

చాంద్రాయణగుట్ట: ఓ మహిళను గొంతుకోసి దారుణంగా హత్య చేయడమేగాక మృత దేహాన్ని తగలబెట్టిన సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతబస్తీ కేశవగిరి హిల్స్ ప్రాంతంలో కేతావత్ బుజ్జి (55), రూప్ దంపతులు నివాసం ఉంటున్నారు. భర్త, కుమారుడు మరో ప్రాంతంలో ఉండటంతో ఒంటరిగా ఉంటున్న బుజ్జి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. బుధవారం కూలీ పనులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చింది. అర్ధరాత్రి ఆమె ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లి చూడగా ఓ మహిళ మృతదేహం తగలబడుతున్నట్లు గుర్తించి మంటలను ఆర్పారు. అప్పటికే ఆమె మృతదేహం సగం కాలిపోయింది. సమాచారం అందుకున్న సైబర్ క్రైమ్ డీసీపీ కవిత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా బుజ్జిని గొంతుకోసి హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు.